క్లుప్తంగా

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని అవుకు మెట్ట వద్ద బీసీజేఆర్ ట్రస్ట్ ద్వారా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ.. అవుకు మెట్ట ప్రాంత ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ, ఉపసర్పంచ్ బురానుద్దీన్ పాల్గొన్నారు.

నేడు మంగపల్లెలో వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి తెలిపారు. శిబిరంలో ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, గుండె, కంటి, చర్మం తదితర వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేస్తారని వెల్లడించారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామసుబ్బారెడ్డి (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని యర్రగుంట్ల పల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామసుబ్బారెడ్డి (62) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. రామసుబ్బారెడ్డికి భార్య రామేశ్వరమ్మ కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఆయన మృతిపై ప్యాపిలి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

ఆలయ వజ్రోత్సవాలకు విరాళం

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం నిర్మించి 75 సంవత్సరాలు కావడంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని వల్లంపాడు గ్రామానికి చెందిన వాసవీక్లబ్ జోనల్ మాజీ చైర్మన్ దినకర్ శెట్టి శనివారం రూ. 5వేలు విరాళం అందించారు. ఉత్సవాల్లో భాగంగా కుంభాభిషేక నిర్వహణకు విరాళం అందజేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం తెలిపారు.

నేడు సుదర్శన యాగం

డోన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం మహా సుదర్శన యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ తెలిపారు. గోవింద మాలధారుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

సంజామల: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్లను శనివారం ఎంఈఓ రాజయ్య,ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి మాధవిలత ఆవిష్కరించారు. క్యాలెండర్లతో పాటు పాకెట స్టిక్కర్స్, క్యాలెండర్లను విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఏపీయూఎస్ పోరాటం చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రాఘురామయ్య, వెంకటరాముడు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

డోన్ టౌన్: వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని హెచ్ఎం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. పాతపేట జెడ్పీ హై స్కూల్‌లో వృత్తి విద్యా కోర్సులను అభ్యసిస్తున్న 9, 10వ తరగతి విద్యార్థులకు శనివారం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.ఆపరేటర్ వెంకటప్పనాయుడు విద్యుత్ ఉత్పత్తి, సరఫరా,విద్యుత్‌లో రకాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్,అల్లీపీరా, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, సుభాన్,బాబు, సుబ్బరాయుడు ఉన్నారు.

‘ప్రత్యేక’ సాధన

- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఏ, బీ, సీ కేటగిరిగా విభజన
- చదువులో వెనుకబడి ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ
- నియోజకవర్గంలో 1032 మంది ఇంటర్ విద్యార్థులు

నియోజకవర్గంలో ఇంటర్ విద్యార్థుల వివరాలు

మండలం	మొదటి సంవత్సరం ఆర్ట్స్‌అండ్ సైన్స్	రెండో సంవత్సరం ఆర్ట్స్ అండ్ సైన్స్
బనగానపల్లె	175	104
కోవెలకుంట్ల	246	148
అవుకు	102	86
కొలిమిగుండ్ల	87	35
సంజమల	37	12

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఈ నెల ఒకటి నుంచి సంకల్ప్–2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల సమయాన్ని పెంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ బ్రాంచీలు ఉన్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 71 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 45 మంది విద్యార్థులు ఉన్నారు. 100 శాతం ఫలితాలే సాధనగా ముందుకు సాగుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల్లో మొత్తం 5 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో 1032 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 647 మంది, రెండో సంవత్సరం 385 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గతంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు ఉండేవి. ఈ నెల 1వ తేదీ నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయి. అన్నీ సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు అధ్యాపకులు తర్ఫీదు ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

కేటగిరిగా విద్యార్థుల విభజన

క్వార్టర్లీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించారు. చదువులో వెనుకబడిన వారిని సీ కేటగిరీగా విభజించారు. వీరి కోసం ఇంటర్‌బోర్డు ప్రతి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అన్ని గ్రూపులకు సంబంధించిన క్వశ్చన్ బ్యాంక్‌ను సరఫరా చేసింది. వెనుకబడిన విద్యార్థులు కూడా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇచ్చేందుకు జూనియర్ లెక్చరర్లను కేర్ టేకర్లుగా నియమించారు. కేర్‌టేకర్లు వారికి కేటాయించిన విద్యార్థులను ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదివించడం, రాయించడం చేస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.



ప్రత్యేక స్టడీ అవర్‌లో విద్యార్థులు

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సంకల్ప్–2025లో భాగంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా సీ గ్రూపు విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. ఏ రోజైనా విద్యార్థులు తరగతులకు రాకుంటే, కేర్ టేకర్స్(అధ్యాపకులు) విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇస్తారు.

–సత్యప్రపూర్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బనగానపల్లె

ప్రత్యేక తరగతులు ఉపయోగం



మా కళాశాలలో నిర్వహించే ప్రత్యేక స్టడీ అవర్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటలకు చదివించడంతో పాటు చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. దీని వల్ల విద్యార్థులు మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

–మమత, హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం

సందేహాలు నివృత్తి చేస్తున్నారు



కాలేజీలో అర్థం కాని విషయాలను ప్రత్యేక తరగతుల్లో అధ్యాపకులను అడిగి తెలుసుకుంటున్నాం. ఒకటికి రెండు సార్లు వినడం వల్ల బాగా అర్థం అవుతోంది. స్టడీ అవర్స్ వల్ల ఎంతో మంచి జరుగుతోంది. చాలా సంతోషంగా ఉంది.

–చిన్న ఎరుకలయ్య, బైపీసీ ద్వితీయ సంవత్సరం

చాలా బాగుంది



ప్రత్యేక స్టడీ అవర్స్‌లో అధ్యాపకులు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. సబ్జెక్టులు రాయించడంతో పాటు సందేహాలు నివృత్తి చేస్తున్నారు. మాకు పరీక్షలు దగ్గరవుతున్న కొద్దీ సమయం వృథా కాకుండా ఈ తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

–వైష్ణవి, ఫస్ట్ ఇయర్ ఎంపీసీ

వాక్సినేషన్ సకాలంలో పూర్తి చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏడీ మోహన్‌రావు

సంజామల: పశువులకు సీజనల్ వాక్సినేషన్ సకాలంలో పూర్తి చేయాలని పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు అన్నారు. శనివారం సంజామల ఏరియా పశువైద్యశాలలో సంజామల, కొలిమిగుండ్ల మండలాల పశుసంవర్థక శాఖ వైద్యులు, జేఈఓ, సిబ్బందితో ఏడీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. పశుగణన సర్వే త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ సకాలంలో స్పందించాలన్నారు. అధికారులు సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని.. పునరావృతం అయితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డాక్టర్ రఘుబాల క్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



రంగాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

బేతంచెర్ల: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్‌బాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో సర్పంచ్ గుమ్మగాళ్లరాజు, వైస్ ఎంపీపీ వెంకట సుబ్బమ్మ, వీఆర్వో మధు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 8 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. అర్జీలను ఎప్పటికప్పుడు విచారణ చేసి పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.



కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యంపై కట్టిన పట్టలు

అన్నదాతల ఆందోళన

అవుకు: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో వరి దగుబడిని కాపాడుకోవడానికి రైతులు సతమతమవుతున్నారు. కొద్ది రోజులుగా అవుకులో అడపాదడపా చిరుజల్లులు కురుస్తున్నాయి. అసలే వరికి సరైన ధరలేక రైతులు నష్టపోతున్నారు. దీనికి తోడు అకాల వర్షాల కారణంగా మరింత నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. వరికోతలు కోసి వచ్చిన దిగుబడిని కల్లాల్లో, రైస్‌మిల్లుల్లో ఆరబోసుకున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటే చాలు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని టార్పాలిన్ పట్టలతో కప్పి రక్షించుకుంటున్నారు.

3న జాబ్‌మేళా

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవరి 3వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ వారు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సునీత తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. ఇందులో హెటిరో ల్యాబ్, జెప్టో, స్విగ్గీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకోసం 91548 30286, 91822 17075 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

లైట్లు వేయరు.. చీకటి తొలగదు

సంజామల: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వీధిలైట్లు వెలగక గ్రామస్తులు చీకటిలో మగ్గుతున్నారు. గ్రామంలో వీధిలైట్లు వెలగక సుమారు నెల అవుతున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. చీకటిలో తిరగాలంటే ఎక్కడ విష పురుగులు ఉంటాయో అని భయపడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంపైనే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే కాటసాని పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: మండలంలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లగురప్ప భార్య లక్ష్మీదేవి(50) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య, తిమ్మాపురం సురేష్‌రెడ్డి ఉన్నారు.

దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

కోవెలకుంట్ల: జిల్లాలోని దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు డిమాండ్ చేశారు. శనివారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ. 3 వేల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచి చేతులు దులుపుకుందన్నారు. అర్హులైన దివ్యాంగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడంతో దివ్యాంగులు జీవనోపాధి కోసం చెడు మార్గాలను ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు దివ్యాంగులు మట్కా, పేకాట, తదితర జూదాలు ఆడుతూ కాస్తో, కూస్తో కూడగట్టుకున్న సొమ్మును పోగొట్టుకుంటున్నారని వాపోయారు. ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకోవాలని కోరారు.

నిరుపేద మహిళకు ఆర్థిక సహాయం

డోన్: పట్టణానికి చెందిన బోయ సుంకులమ్మ కు జీవం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శనివారం రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. కొన్నేళ్లుగా తీవ్ర ఆయాసం(న్యూమోనియా)తో బాధపడుతున్న పేదరాలైన సుంకులమ్మకు కర్నూలులో ని ప్రైవేటు ఆస్పత్రిలో ఐదురోజుల పాటు ఉచితంగా చికిత్స చేయించడంతో పాటు ఆర్థిక సహాయం చేసినట్లు సొసైటీ కోశాధికారి విష్ణు తెలిపారు. సభ్యులు శిరీష, సుధాకర్ ఉన్నారు.

కుర్ని సంఘం క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

డోన్ టౌన్: పట్టణంలోని వెంకటాచలం ఫంక్షన్ హాల్‌లో కుర్ని సంక్షేమ సంఘం నాయకులు శనివారం నూతన సంవత్సర క్యాలెండ్లరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా గౌరవ అధ్యక్షుడు అజయ్‌కుమార్(రిటైర్డ్ తహసీల్దార్) మాట్లాడుతూ.. కుర్ని సంఘీయులు ఐకమత్యంగా ఉండి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర మహాసభలకు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుర్ని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, డోన్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు బందికె హరిప్రసాద్, మైలే లక్ష్మీనారాయణ, సభ్యులు మాచాని రామకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

బేతంచెర్ల: వ్యవసాయ పరపతి సహకార సంఘం ఖాతాదారులు ఆయా గ్రామ సచివాలయాల్లో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పర్సనల్ ఇన్‌చార్జి నాగేంద్ర, సెక్రటరీ ఓబులేష్ అన్నారు.సహకార సంఘంలోని ఖాతాదారులు ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ రాయితీ వర్తిస్తుందని, ఓటు హక్కు ఉంటుందని, లేకుంటే ఓటు హక్కు కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శాశ్వత అన్నదానానికి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర కుమార్, లక్ష్మీనారాయణ, అనుముల సుధీర్, జనార్దన్ రూ. 50 వేల విరాళం అందజేశారు. అయ్యప్ప సేవా సమితి కార్యదర్శి బచ్చు సుబ్రమణ్యంకు నగదు అందజేశారు.

బనగానపల్లె కోర్టు భవనం పరిశీలన



బనగానపల్లెలో కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి

బనగానపల్లె రూరల్: బనగానపల్లెలోని పురాతన కోర్టు భవనాన్ని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఇటీవలే బనగానపల్లెకు చెందిన న్యాయవాదులు ఆయన్ను కలిసి శిథిలావస్థలో ఉన్న కోర్టు భవనం గురించి విన్నవించారు. ఈ భవనం పురావస్తుశాఖ ఆధీనంలో ఉండడంతో కోర్టు భవనం కూల్చకుండా పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని జిల్లా న్యాయమూర్తి పరిశీలించారు. నూతన కోర్టు నిర్మాణం ఆలస్యమైతే పట్టణంలో ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయంలో తాత్కాలికంగా కోర్టు పరిపాలన నిర్వహించాలని బార్ అసోసియేషన్ న్యాయవాదులకు సూచించారు. అలాగే పాత భవనంతో పాటు ఖాళీ స్థలం ఎంత విస్తీర్ణం ఉంది? తదితర వివరాలను జిల్లా న్యాయస్థానానికి పంపాలని, పరిశీలించి వీలైనంత త్వరగా నూతన భవన నిర్మాణానికి ఉన్నత స్థాయి అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట బనగానపల్లె ఇన్‌చార్జ్ జడ్జి అబ్దుల్ రెహ్మాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజాహుస్సేన్, సెక్రటరీ వెంకటేష్, సీనియర్ న్యాయవాదులు రఘురామిరెడ్డి, పరశురామిరెడ్డి, యూసఫ్‌హుస్సేన్, అబ్దుల్‌ఖైర్, ప్రసాద్, శ్రీనివాసమూర్తి, ఆజాం హుస్సేన్, అల్లావుద్దీన్, జాకీర్, ఇర్ఫాన్ అబ్బాస్, నాగేంద్రరెడ్డి, ఇబ్రహీం, విక్రమ్, భాస్కర్‌ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీడీపీఓ షంషాద్‌బేగం

డోన్ రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లతో సమయాన్ని వృథా చేసుకోకుండా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. బాలికలకు దేశంలోని రంగాల్లో సమాన హక్కు ఉందని తెలిపారు. చదువులను మధ్యలో ఆపేయకుండా ముందుకు సాగాలన్నారు. కష్టాలను దాటినప్పుడే విజయాలను అందుకుంటారని పేర్కొన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. చిన్న వయసులోనే పెళ్లిలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, పెళ్లి చేసిన వారు, చేసుకుంటున్న వారు శిక్షార్హులవుతారని తెలిపారు. ఇలాంటి వాటిపై మహిళా పోలీస్, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శోభారాణి, పరమేశ్వరి పాల్గొన్నారు.

అందంగా.. రక్షణగా



ఆకుమల్లలో మిరపపంటలో నాటిన బంతిపూల మొక్కలు

సంజామల: మిరప పంటలో బంతి పూలను సాధారణంగా చూస్తుంటాం. చాలా మంది పూల కోసమో లేదా పంట అందం, దిష్టి తగలకుండా ఉండడం కోసమో అని భావిస్తుంటారు. బంతి పూలను సాగు చేయడం ద్వారా మిరప పంటలో రసం పీల్చే పురుగు, శనగపచ్చ పురుగు, నల్లి, త్రిప్స్, పొగాకు లద్దెపురుగు, దోమ తదితర పురుగులు ఆ బంతిపూల మీదకు వచ్చి చేరుతాయి. అందంగా ఆకర్షణీయంగా ఆ బంతి పూలు కనపడితే రసం పీల్చే పురుగులు ఆ పువ్వు మీద చేరుతాయి. బంతి పూలు లేకుంటే మిరప పూతను, ఆకులను ఆశించి మొక్క ఎదుగుదలను అడ్డుకుంటుంది. అదే బంతిపూలను వేయడం ద్వారా రసం పీల్చే పురుగుల ఉధృతి తగ్గించే అవకాశం ఉంటుంది. రైతులు మిరప పంటలో బంతిపూలను నాటుకోవడం ద్వారా పసుపు, నారింజ రంగుతో పూసే బంతిపూలు అందంగా.. రక్షణగా ఉంటాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

నందీశ్వరస్వామికి పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజులలో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. శనివారం 34మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకున్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను గావించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి నెలకొంది.

వీధులు బురదమయం



ఆకుమల్ల మెయిన్ బజార్ రోడ్డులో నిల్వవున్న మురుగు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో పలు వీధులు బురదమయంగా మారాయి. ముఖ్యంగా ఆకుమల్ల మెన్‌బజార్, ఎస్సీకాలనీ, ఓసీ కాలనీ తదితర వీధులు అధ్వానంగా మారాయి. మురుగునీరు ప్రవహిస్తుండడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరు నెలలుగా ఇలానే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో చాలా మంది ఇంటి ముందు రోడ్డును ఆక్రమించుకోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.